జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



గురువారం | 3-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 141 పేజీలు: 8 వెల : రూ.7




# మైనర్ దొంగ

**✳ పలాసలోని ఓ షాపులో చోరీకి పాల్పడిన మైనర్ ✳ సీసీ కెమెరాలో రికార్డయిన దొంగతనం ✳ గంజాయి, మత్తు మాయలో కొందరు యువత ✳ పోలీసులు కౌన్సెలింగ్ చేస్తున్న మారని తీరు**





**పలాస, అక్టోబరు 3 (వార్త):**కొందరు మైనర్లు జల్సాలకు బానిసై తప్పుదోవ పడుతున్నారు. చదువుకుని ప్రయోజకులు కావాల్సిన సమయంలో గంజాయి, మత్తు వంటి పదార్థాలు తీసుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారు. తెలిసీ తెలియని వయస్సు, తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కొందరు చిన్నప్పటి నుంచే చెడు దారిని ఎంచుకుంటూ నాశనం చేసుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నామన్నది మరచిపోయి.. చివరకు కటకటాలపాలవుతున్నారు. జిల్లావ్యాప్తంగా పోలీసులు విద్యాసంస్థల వద్ద అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా కొందరిలో మార్పు రావడం లేదు. ఎక్కువగా మైనర్లు సరదాగా మద్యం, గంజాయిని సరదా కోసం తాగడం అలవాటుగా చేసుకుని.. చివరికి ఆ వ్యసనం నుంచి బయటకు రాలేక చేజేతులారా భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారు. ఇటీవల శ్రీకాకుళం నగరంలో కొందరు మైనర్లు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. కొద్ది రోజుల కిందట శ్రీకాకుళం నగర శివారు ప్రాంతాల్లో కొందరు మైనర్లు మద్యం తాగి గొడవకు పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి కాశీబుగ్గలో ఓ మైనర్ బాలుడు వెంకటపద్మా క్యాష్యూ హెూల్ సేల్ అండ్ రిటైల్ షాపులోకి చొరబడ్డాడు. కత్తి పట్టుకుని లోపలంతా కలియదిరిగాడు. క్యాష్ కౌంటర్ తాళాలు పగుల గొట్టి రూ.5వేలు దొంగిలించాడు. ఆ కత్తి ని షాపులో విడిచి పెట్టి వెళ్లిపోయాడు. ఈ చోరీ దృశ్యం షాపులో ఉన్న సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. షాపు యజమాని ఈశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వైభవంగా.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**✳ కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలు ✳ ధగధగమెరుస్తున్న మండపాలు ✳ అమ్మవారికి ప్రత్యేక పూజలు ✳ కిటకిటలాడిన ఆలయాలు ✳ భవానీ మాల వేసిన భక్తులు**



**శ్రీకాకుళం, అక్టోబరు3(వార్త):** జిల్లావ్యాప్తంగా దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులు మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారిని ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చారు. దుర్గమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. విద్యుద్దీపాలతో దుర్గమ్మ మండపాలు మెరుస్తున్నాయి. దసరా ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తులు భవానీ మాలాధారణ చేశారు. శ్రీకాకుళం నగరంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, ఫణి కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు రోజుకు ఒక అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తుందని చెప్పారు. గురువారం విజయ దుర్గ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారన్నారు. అలాగే నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపురసుందరీ కాల భైరవ పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గణేష్, జగన్ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధ్యక్షులు రెడ్డి గిరిజా శంకర్ ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో రాజరాజేశ్వరి, పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత, ముత్యాలమ్మ, నానుబాలవారి వీధిలోని విజయదుర్గ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పట్టువస్త్రాలను సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు దుర్గమ్మ పలు ఆలయాల్లో బాల త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇచ్ఛాపురంలో స్వేచ్ఛావతి అమ్మవారు.. శైలపుత్రిగా పూజలందుకున్నారు.




# చీకట్లో ఆసుపత్రి

**✳ కరెంటు పోతే ఇఛ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో అంధకారం ✳ పనిచేయని జనరేటర్ ✳ చీకట్లో ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది**

5లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, అక్టోబర్ 3 (వార్త): పాతపట్నం విద్యుత్ ఉప కేంద్రం మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, గోపాలపురం, సీతారంపల్లి, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిని, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

మందస, అక్టోబర్ 3 (వార్త): మందస మండలంలోని కొన్ని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యోగీశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.యోగి తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించుట, విద్యుత్ లైన్స్ నిర్వహణ దృష్ట్యా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు హరిపురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నామన్నారు. హరిపురం, నారాయణపురం, మఖరజోల, అంబుగాం, బాలిగాం, భేతాళపురం, రట్టి, బిడిమి, గంగువాడ, లోహరిబంద, నల్లబొడ్లూరు, బహడపల్లి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

# ఎంత నాణ్యతగా కట్టారో..!

■ ఇచ్ఛాపురంలో 24 గంటల్లో కూలిన కల్వర్టు

ఇచ్ఛాపురం, అక్టోబర్ 3(వార్త) : ఇచ్ఛాపురం పరిధి సూరంగి రాజా మైదానం వద్ద ఆర్అండ్‌బీ కల్వరు శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో పూడిక పేరుకు పోవడంతో కవర్ శ్లాబ్ తొలగించారు. నిధులు ప్రతిపాదన లేకపోవడంతో మంజూరు కూడా కాలేదు. దీంతో కాంట్రాక్టర్ గుజ్జు నారాయణరెడ్డిని కోరి పనులు చేయించారు. పాత ప్లేట్‌లపైన శ్లాబ్ వేశారు. బాహుదా వంతెన కూలడంతో ఇదే ప్రస్తుతం ప్రధాన రహదారి. నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. దీంతో వేసిన 24 గంటల్లోనే పలకలు విరిగి రంధ్రం ఏర్పడింది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏఈ కామేష్‌ని వివరణ కోరగా పాత ప్లేట్లు కావడంతో విరిగి పోయాయని చెప్పారు. మున్సిపాలిటీ నుంచి ఎటువంటి నిధులు ఖర్చు చేయకుండా కాంట్రాక్టర్ ఔదార్యంతో పని చేశారని చెప్పారు. కమిషనర్ రమేష్‌ను వివరణ కోరగా శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర విజ్ఞప్తితో కాలువ బాగు చేశామని చెప్పారు. శిథిలావస్థకు చేరినట్లు దృష్టికి వచ్చిందని, కింద మట్టితో కప్పివేసి పూర్తి చేస్తామని చెప్పారు.




## ఎంపీడీవోగా సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో సూర్యనారాయణను అభినందిస్తున్న సిబ్బంది

మందస, పాతపట్నం, అక్టోబర్ 3 (వార్త): మందస మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పైల సూర్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కవిటి మండలం నుంచి బదిలీపై మందసకు ఆయన వచ్చారు. కాగా, మందసలో ఎంపీడీవోగా పనిచేసిన వాయలపల్లి తిరుమలరావు కంచిలి మండలానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణను అధికారులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందస మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో మండలాన్ని ముందుకు తీసుకెళ్తానన్నారు.

## కళింగపట్నంలో భవానీ దీక్షలు ప్రారంభం



గార, అక్టోబర్ 3 (వార్త): కళింగపట్నం పూర్ణ పుష్కలాంబ సహిత అయ్యప్ప స్వామి వారి సన్నిధానం, లక్ష్మీ ఆలయాల్లో గురువారం భవానీ దీక్షలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల దీక్షకు భక్తులు మాలలు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి గిరిబాబు బిడియం వెంకట్ శర్మ భక్తులకు భవానీ మాలాధారణ చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు బొడ్డు లక్ష్మయ్య, దీర్ఘాసి రామకృష్ణారెడ్డి, ముంజేటి రాము, గంగాడ శ్రీను, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నీట్ ర్యాంకర్ గౌతమికి ఘన సన్మానం



పాతపట్నం, అక్టోబర్ 3 (వార్త): పాతపట్నం ఆదర్శ పాఠశాలలో 2023లో ఇంటర్ పూర్తి చేసిన బండి గౌతమి నీట్‌లో అదరగొట్టింది. ఆ పరీక్షలో 720కు 700 మార్కులు తెచ్చుకొని ఆలిండియా స్థాయిలో 1125, రీజనల్ స్థాయిలో 353 ర్యాంక్ సాధించి ఋషికేష్ ఎయిమ్స్‌లో మెడిసిన్ సీట్ సాధించింది. దీంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది గౌతమిని, ఆమె తల్లి బండి భారతిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి మాట్లాడుతూ బండి గౌతమి సాధించిన ఈ ఘనత పాఠశాలకు గర్వకారణమన్నారు. చాలా పేద కుటుంబం నుంచి వచ్చిన గౌతమి కష్టపడి చదివి వైద్యరంగంలో సీట్ సంపాదించడం విద్యార్థులకు ఆదర్శప్రాయం అవుతుందన్నారు. గౌతమికి మంచి భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.

కళాశాల వృక్ష శాస్త్ర ఉపాధ్యాయులు అప్పలరాజు మాట్లాడుతూ గౌతమి ఆణిముత్యం అని కొనియాడారు. ఇలాంటి విద్యార్థినులతో పాఠశాల స్థాయి పెరుగుతుందన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా గౌతమిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని, తద్వారా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

వైస్ ప్రిన్సిపాల్ ప్రసా దరావు మాట్లాడుతూ ఈ సంవత్సరానికి గాను బండి గౌతమిని "ప్రైడ్ ఆఫ్ ఏపీఎంఎస్" గా నిర్ణయించా మని, ఇది తమకు చాలా గర్వకారణన్నారు. రానున్న కాలంలో ఈ బిరుదును సాధించడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 5, 6 తేదీల్లో బస్ పాస్ కౌంటర్స్ మూసివేత



టెక్కలి, అక్టోబర్ 3 (వార్త): ఏపీఎస్ఆర్టీసీలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు జారీ చేసే బస్సు పాస్ సాఫ్ట్‌వేర్‌ని ఆధునికీకరిస్తున్నందున ఈనెల 5,6 తేదీల్లో (శని, ఆదివారం) విద్యార్థులకు బస్సు పాసులు జారీచేసే కౌంటర్స్ మూసివేస్తున్నామని టెక్కలి డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా పని చేస్తాయని తెలిపారు. ఈ విషయం విద్యార్థులు గమనించాలని కోరారు.

## జిల్లేడు ద్రావణం తయారీపై శిక్షణ

మందస, అక్టోబర్ 3 (వార్త): చీపి పంచాయతీలోని చొంపాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పంటతో పాటు ఇతర పంటలకు తెగుళ్లు ఆశిస్తాయని, దీంతో జిల్లేడు ద్రావణాన్ని ఎలా తయారు చేయాలో రైతులకు వివరించినట్టు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తెలిపారు. ఈ కషాయం పంటల్లో పొటాష్ లోపాన్ని నివారించి, సూక్ష్మ పోషకాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బాబాజీ, లక్ష్మణ్, కృపాసింధు, బాలకృష్ణ, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.



జిల్లేడు ద్రావణ తయారీని వివరిస్తున్న అధికారులు, సిబ్బంది

# దొంగలొస్తున్నారు..బహు పరాక్..!

ఇచ్ఛాపురం, అక్టోబర్ 3(వార్త): ఇళ్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున సెలవులకు ఊళ్లకు వెళ్లినప్పుడు గానీ, బయటకు వెళ్లినప్పుడు గానీ బంగారం, నగదు, విలువైన వస్తువులను భద్రపరచుకోవాలని సీఐ మీసాల చిన్నంనాయుడు సూచించారు. విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్‌లో ఉంచుకోవాలని తెలిపారు. చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నందున ఒంటరిగా వెళ్తున్న మహిళలు బంగారు ఆభరణాలు వేసుకొని, జనాలు లేని ప్రదేశాలలో తిరగరాదని చెప్పారు. మోటారు సైకిళ్లను ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేయరాదని, బైక్‌లను సురక్షిత ప్రదేశాలలో పార్క్ చేసుకొని, హ్యాండ్ లాక్, లీడింగ్ చైన్ వేసుకోవాలన్నారు. బంగారం, నగలు మెరుగు పెడతానని వచ్చిన వ్యక్తులను నమ్మవద్దని, అటువంటి వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. బ్యాంక్ నుంచి నగదు డ్రా చేసినప్పుడు గానీ, నగదును తీసుకు వెళ్లినప్పుడు గానీ, బైక్ డిక్కీ లో ఉంచినప్పుడు గానీ జాగ్రత్త వహించాలన్నారు. బ్యాంక్ ఏటీఎం కార్డును అపరిచిత వ్యక్తులకు ఇచ్చి, డబ్బులు విత్‌డ్రా చేయరాదన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బ్యాంక్ వివరాలను గానీ, వ్యక్తిగత వివరాలు గానీ, ఓటీపీలు గానీ, పాస్ వర్డ్‌లు గానీ అపరిచిత వ్యక్తులకు తెలియజేయరాదని కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వ్యాసరచన పోటీల్లో కరవంజ విద్యార్థిని ప్రతిభ

జలుమూరు, అక్టోబర్ 3 (వార్త): జలుమూరు మండలం కరవంజ ఏపీ మోడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ప్రణవిక వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరి చారు. 'మై విజన్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ 2047' అంశంపై వ్యాసరచన పోటీలో మండల, డివిజన్ స్థాయిలో మొదటి స్థానాన్ని, జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి సత్తా చాటింది.

దీంతో ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు అభి నందించారు.



## రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు చందు



వంగర, అక్టోబర్ 3 (వార్త): వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వతరగతి చదువుతున్న కొమరాపు చందు, 100 మీటర్ల రిలే పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్ఎం రమణమ్మ గురువా రం తెలిపారు. ఈ సందర్భంగా చందుని వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.కవిత, అంగ్ల ఉపాధ్యాయుడు ఎస్.జయకృష్ణ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభి నందనలు తెలిపారు. చందు ఎంపికపై ఎంపీపీ యు,సురేష్ ముఖర్జీ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

## వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసిన యువకులు



నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామం లోని ఎంపీయూపీ పాఠశాలలో నాచు పట్టిన వాటర్ ట్యాంకును గురువారం యువకులు శుభ్రం చేశారని గ్రామ యువత అధ్యక్షుడు తారక్ తెలిపారు. విద్యా ర్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, దసరా సెలవులు కావడంతో హెచ్ఎం ఆధ్వర్యంలో ట్యాంకు శుభ్రపరిచామన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని యువత తెలిపారు.

## 'వరి సాగులో చీడపీడల నివారణ తప్పనిసరి'



జలుమూరు, అక్టోబర్ 3 (వార్త): జలుమూరు మండలంలోని మర్రివ లస, జోనంకి, నగిరికటకం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించామని మండల వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ తెలి పారు. రాగోలు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఉదయ్‌బాబు, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, ఏడీఏ రవీంద్రభారతి వరి పొలాలను పరి శీలించారు. వరి సాగులో చీడపీడల నివారణ చర్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

## 'చట్ట పరిధిలో అర్జీలు పరిష్కరిస్తాం'

నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేట మేజర్ పంచాయతీ కార్యాల యంలో గురువారం ఈవో ద్రాక్షాయిని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు తదితర వార్డు మెంబర్స్ గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థుల అర్జీలను చట్ట పరిధిలో సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



### పంచాయతీరాజ్ వ్యవస్థను

# బలోపేతం చేయడమే లక్ష్యం

### అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్



**శ్రీకాకుళం, అక్టోబరు3 (వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆయా అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఇంకా గ్రామ, మండల, జిల్లా పరిషత్తులలో సాధారణ కనీస పరిపాలనా విధాన చట్టం 1994, గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగు నీటి సరఫరా, లేఅవుట్ ప్లాన్లు, బిల్డింగ్ రెగ్యులరైజేషన్, స్థానిక సంస్థల ఆస్తులు వాటి పరిరక్షణ,వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అక్షరాస్యత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య శాసనాలు, సాంఘిక సంక్షేమ పథకాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణలో భాగంగా ఎంపిక చేసిన పంచాయతీరాజ్ లోని వివిధ క్యాడర్లకు చెందిన 11మందికి ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వీరంతా ఆయా గ్రామపంచాయతీలలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆయా అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు పాటు ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### ల్యాబ్ టెక్నీషియన్స్ ఎన్నిక ఏకగ్రీవం

**శ్రీకాకుళం, అక్టోబరు 3 (వార్త):** జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జె.కేశవరావు, బి.అప్పలరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని జిల్లాలోని ఆయా పీహెచ్సీలు, ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు ఎన్నుకున్నారు. అసోసియేషన్ ట్రెజరీగా సిహెచ్ విజయ్ కుమార్, అసోసియేటివ్ ప్రెసిడెంట్‌గా ఎన్.లూసీ ఎస్టర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జి.రాజేష్, ఇంకా ఉపాధ్యక్షులను, సహాయ కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి రాజేష్, వి.మాధవి రాణి, బి. అరుణకుమారి, కే.జగదీష్, జి.వెంకటరమణ, సిహెచ్.విజయ్ తదితరులను కార్యవర్గంలో వివిధ స్థానాలకు ఎన్నుకున్నారు.



## నూతన పద్ధతుల్లో వ్యవసాయ సాగు లాభసాటి

నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేట మండలంలోని కోమర్తి గ్రామంలో మండల వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి కేవీకే డీవీవో హెడ్ భాగ్యలక్ష్మి, రాగోలు కేవీకే సైంటిస్ట్ ఉదయభాను, ఏడీఏ రవీంద్ర భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పొలాలను పరిశీలించి రైతులు నూతన పద్ధతులలో వ్యవసాయ సాగు చేయాలని సూచించారు. సాంకేతి కతను ఉపయోగించుకోవాలని కోరారు.




## తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి



వంగర, అక్టోబర్ 3(వార్త): తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే వ్యవసాయ మెలకువలు, విధానాలపై వ్యవసాయ అధికారి కన్నబాబు రైతు లకు తెలిపారు. గురువారం వంగర మండలంలోని మద్దివలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యకమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ప్రభుత్వం "పొలం పిలు స్తోంది" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతో పాటుగా సంబంధిత వ్యవసాయాధికా రులు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడు లపై అవగాహన కల్పించారు. అధికా రులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీ లనతో పాటు లోపాలు గుర్తిస్తూ, వాటికి తగినవిధంగా పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకోవడం, సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న 14 శాఖల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించిందని ఆయన రైతులకు తెలిపారు. పొలాల్లోకి రైతులతో వెళ్లి పంటలను పరిశీలించారు. ఉద్యాన శాఖ అధికారి పామాయిల్ మొదలగు పంటలపై మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో సీఎన్ఎఫ్ స్టాఫ్ సింహాద్రినాయుడు, పోలినాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు బంకురు నవీన్, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు ఉమ, ఆదర్శ రైతు రామకృష్ణ, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేట ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జలుమూరు మోహనరావు (33) ఆకస్మికంగా గురువారం మృతిచెందారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు జరిగిన సందర్భంగా నరసన్నపేట నుంచి పాతపట్నంకు మోహన్‌రావుకు బదిలీ అయింది. బుధవారం స్థానిక కార్యాలయంలో రిలీవ్ అయిన ఆయన, గురువారం పాతపట్నంలో విధుల్లో చేరేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలో మంచినీటి కోసం దిగిన ఆయన గుండెపోటుతో మృతి చెందారు.

## టెట్‌కు 330 మంది హాజరు

నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ పరీక్ష కేంద్రంలో గురువారము టెట్ నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో 330 మంది అభ్య ర్థులు పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పరీక్షా కేంద్రానికి గంట ముందే అభ్యర్థులు చేరుకున్నారు. అభ్యర్థులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు.







### నీలమణి దుర్గా అమ్మవారికి పట్టు వస్త్రాలు ..

పాతపట్నం, అక్టోబర్ 3 (వార్త): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణి దుర్గా అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జ్యోతి ప్రదీపన చేసి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హెూమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. నీలమణి దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి యేటా దసరా రోజున పాతపట్నం నీలమణి దుర్గా అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో సొంత ఖర్చులతో అన్నసంతర్పణ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల దృష్ట్యా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ సిబ్బందిని ఆదేశించారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో టి.వాసు దేవరావు, రికార్డ్ అసిస్టెంట్ కోడి సుదర్శనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణ అధ్య క్షుడు సైలాడ సతీష్, సన్యాసి, శివాల చిన్నయ్య, గోకవ లస అశోక్, సిర్ల ప్రభాకర్, కలమట భుజంగరావు, ధనుంజయ, బుల్లిబాబు, శ్రీరాం దుర్గాప్రసాద్, మద్దు రామారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### ఆవలింగిలో ..

సారవకోట, అక్టోబర్ 3(వార్త): సారవకోట మండలం ఆవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ 9రోజుల పాటు అమ్మవారిని 9 రూపాల్లో అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ దంపతులతో సామూహిక కుంకుమార్చనలు చేపట్టనున్నారు. చివరి రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు హంస వాహన సేవ చేపట్టనున్నారు.

# అంబరం..సంబరం..!

**ఊరూరా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభం**

**కొలువు తీరిన కనకదుర్గమ్మ**

**పూజలు జరిపిన భక్తులు**



### నరసన్నపేటలో ..

నరసన్నపేట, అక్టోబర్ 3 (వార్త): నరసన్నపేట పట్టణంలో దుర్గాభవాని టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు ప్రారంభించారు. గురువారం అర్చకులు మావుడూరు జగదీష్ బాబు సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.







### రుషింగిలో..

వంగర, అక్టోబర్ 3 (వార్త):వంగర మండలంలోని రుషింగిలో దసరా(విజయ దశమి) నవరాత్రుల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది యలకల రాజగోపాలరావు దంపతులు గురువారం ఆలయంలో పూజలు జరిపారు. ఈ నెల 12 వరకూ దేవిని అత్యంత భక్తి,శ్రద్ధలతో పూజిస్తారు. ఒక్కోరోజు ఒక్కోరూపంలో అలంకరిస్తారు. 15 ఏళ్లుగా దేదీప్యమానంగా ఘనంగా దుర్గా నవరాత్రులను నిర్వహిస్తూ, భారీగా అన్న సమారాధన జరుపుతున్నారు. ఈ పూజల్లో న్యాయవాది కుటుంబీకులు ఎలకల రమేష్, దుర్గారావు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



### బొడ్డపాడులో..

పలాస, అక్టోబర్ 3 (వార్త): విప్లవాలకు పుట్టి నిల్లుగా వెలిగిన పలాస మండలం బొడ్డపాడు గ్రామం లో లౌకికవాదానికి తిరుగులేదు. ఎన్నో ఏళ్ల తర్వాత బొడ్డుపాడు గ్రామంలోని పెద్ద వీధిలో దుర్గాదేవి పూజా కార్యక్రమాన్ని గురువారం శాస్త్రీయంగా పూజా ప్రారంభించారు. శరన్నవ రాత్రులు సందర్భంగా ఈ తొమ్మిది రోజులు పూజలు జరుపుతామని నిర్వహణ కమిటీ తెలిపింది.

... 532001 ... 9963063761, 9160000247, ... 016413

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

### డా.మిశ్రో మాస్టారుకు
## 'లాల్ బహుదూర్ శాస్త్రి స్మృతి అవార్డు'

**ఎల్ఎన్‌పేట, అక్టోబరు 3 (వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు, సామాజిక వేత్త, లయన్.డా.ఎం.కె.మిశ్రో 'లాల్ బహుదూర్ శాస్త్రి స్మృతి సమ్మాన్'అవార్డును అందుకున్నారు. ఆయన పలు రంగాల్లో అందిస్తున్న సేవలకు గాను రాజస్తాన్‌కు చెందిన సంగం అకాడమీ ఈ అవార్డును అందజేసింది. డా.మిశ్రోకు ఈ అవార్డు రావడం పట్ల లయన్సు క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధికారులు అభినందనలు తెలిపారు.



# టెక్కలిలో ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు

* మొట్టమొదటిసారిగా అష్టాదశ శక్తి పీఠాల అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు * భక్తులను ఆకట్టుకుంటున్న దుర్గా మండపం * ప్రత్యేక పూజలు చేసిన జనపాన లక్ష్మణరెడ్డి

**టెక్కలి, అక్టోబరు 3(వార్త):** టెక్కలిలో దుర్గా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమైంది. టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వివేకనంద యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది అత్యంత వైభవంగా దుర్గ శరన్నవరాత్రి వేడుకలకు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆంధ్రాలోనే మొట్టమొదటిసారిగా అష్టాదశ శక్తి పీఠాల్లో ఉన్న 18 అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించారు. వీటిని చూసేందుకు భక్తులు పెద్ద





ఎత్తున బారులు దీరారు. తొమ్మిది రోజులపాటు విశేషాలంకరణలో వివిధ రూపాల్లో అమ్మవారికి పూజలు చేయనున్నారు. ఇందులో భాగంగా హెూమాలు దీపారాధన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, విశేష పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు జనపన లక్ష్మణ్ రెడ్డి తెలిపారు.

# డిపాజిట్ సొమ్ము చెల్లించండి

### సహారా ఖాతాదారులు, ఏజెంట్ల డిమాండ్

**శ్రీకాకుళం, అక్టోబరు 4 (వార్త):** ఖాతాదారులకు డిపాజిట్ సొమ్మును తక్షణమే చెల్లించాలని సహారా కస్టమర్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాకుళం బ్రాంచ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఆనందమయి కన్వెన్షన్ హాల్లో గురువారం సహారా కార్యకర్తలు, ఖాతాదార్లు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడారు. సహారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బోయిన సత్యనారాయణ, బైపల్లి సత్యరాజు, కార్యదర్శి కె.వి.ప్రసాదరావు, జామి కొండలరావు మాట్లాడారు. సహారా చెల్లింపులు జరగక గత 12 ఏళ్లలో 7674 మంది ఏజెంట్లు, ఖాతాదారులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 సంవత్సరాలుగా సహారా ఖాతాదారులకు కాలం నిండిన ఖాతాలకు చెల్లింపులు జరగడం లేదన్నారు. తక్షణం నగదు చెల్లించేలా చూడాలని వారు కోరారు.



# 2047 నాటికి సంపన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

* పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి
* వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరం
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, అక్టోబర్3 (వార్త):** స్వర్ణాంధ్ర-2047 సాధనకు అందరి భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లాలో ఆర్థిక, సామాజిక, సాంకేతికంగా వృద్ధి చెందుటకు తగిన సూచనలు సేకరించుటకు వర్క్ షాప్ ఏర్పాటు చేయడమైనదన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలసి ఆయన అభిప్రాయ సేకరణకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి సంపన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలవాలన్నారు. ఇందుకు అందరి భాగస్వామ్యం అవసరమని చెప్పారు. జిల్లాలో అతి పొడవైన తీరం ఉందని దీనిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపిస్తే పరిశ్రమలలో పని చేయడానికి టెక్నికల్ స్టాఫ్ అవసరం అవుతుందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పాలిటెక్నికల్, ఐటిఐ చేసిన వారికి జిల్లాలోనే కల్పించే అవసరం ఉందన్నారు. ఫలితంగా ఆ ప్రాంతం బాగుపడడమే కాకుండా ఆ పరిశ్రమకు లాభం కూడా ఉంటుందని వివరించారు. పరిశ్రమలతోనే కాకుండా ఆ ప్రాంతానికి వచ్చే సి.యస్.ఆర్. ఫండ్స్ నుండి కూడా అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రాధమిక రంగం నుండి వ్యవసాయం, ఉద్యానవనం పంటల సాగుపై పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ సాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం కూలీల కొరత వేదిస్తోన్న నేపథ్యంలో యాంత్రీకరణ



ఎంతో మేలు, ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. జీడి, కొబ్బరి పంటలపై పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పాత పద్ధతిలోనే సాగుచేస్తున్నారని, అధునాతన పద్ధతులు అవలంబించడం లేదన్నారు. పలాస కు చెందిన రైతు మాట్లాడుతూ ఇటీవల తాను నూతన పద్ధతులను తెలిపే ఒక టీంను బెంగుళూరు నుండి తీసుకురావడమైనదని, వారు తెలిపిన పద్ధతుల్లో పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎకరాకు మూడు క్వింటాళ్లు పండితే ప్రస్తుతం తాను కొత్తగా వేసిన మొక్కలు మూడు యేళ్లలో పంట దిగుబడి వస్తుందని చెప్పారు. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఈ విధంగా జిల్లా అంతటా వస్తరిస్తే ఆ ప్రాంత రైతులు బాగుపడతారన్నారు. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి సాధించేందుకు అందరు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఆర్ధికంగా అభివృద్ధి సాదించాలన్నారు. పలువురు ఎన్జీఓ సంస్థలు, చాంబరాఫ్ కామర్స్ ప్రతినిధులు, పరిశ్రమల యాజమాన్యాలు వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి రాజేంద్ర ప్రసాద్, స్వచ్ఛంద సంస్థలు, పలువురు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రశాంతంగా..
# టెట్ ప్రారంభం

**శ్రీకాకుళం, అక్టోబరు 3(వార్త):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లాలోని రెండు కేంద్రాల్లో గురువారం ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 200 మంది అభ్యర్థులకుగానూ 188 మంది పరీక్షకు హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో 660 మంది అభ్యర్థులకుగానూ 527 మంది పరీక్ష రాశారు. నరసన్నపేట పరీక్షా కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను నరసన్నపేట, లావేరు, ఎచ్చెర్ల ఎంఈవోలు పర్యవేక్షించారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రం (చిలకపాలెం)లో ఈ నెల 6, 13, 20 తేదీల్లో టెట్ జరగ నుంది.

## నేడు జిల్లాకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం రాక

**శ్రీకాకుళం, అక్టోబరు 3 (వార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని కమిషన్ కార్యదర్శి ఎన్.పద్మజ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు సంబంధిత వివరాలను పంపించారు. గురువారం రాత్రి రోడ్డు మార్గాన గుంటూరు నుంచి బయలు దేరనున్న ఈయన శుక్రవారం ఉదయం శ్రీకాకుళం చేరుకోనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్‌తో ఆయన ఛాంబర్ లో జిల్లాలో నెలకొన్న వివిధ బాలల హక్కుల పరిరక్షణ, సమస్యలపై భేటీ కాను న్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా పోలీసు ఎస్పీ తో భేటీ అవుతారు. మధ్యా హ్నాం 12 గంటలకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో జిల్లాలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల పెండింగ్ బస్‌లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తల్లి పాల కేంద్రాలు ఏర్పాటుపై డిపో మేనేజర్లతో సమీక్షించనున్నారు. మధ్యాహ్నాం ఒంటిగంటకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సారథ్యాన జిల్లాలో దివ్యాంగ బాలలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై జరగనున్న సమీక్షలో పాల్గొనున్నారు. మధ్యాహ్నాం మూడు గంటలకు జిల్లా ఇంటర్మీడియట్ ఆర్.ఐ.ఓ నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో జిల్లా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ళ పాత్రపై జరగనున్న అవగాహనా కార్యక్రమంలో పాల్గొనున్నారు. అనంతరం రోడ్ మార్గాన గుంటూరుకు తిరుగుపయనమవ్వనున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గార, అక్టోబరు 3 (వార్త):** తూలుగు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నాం రెండు గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గార, తూలుగు, బూరవల్లి, అంబళ్లవలస , కొర్లాం, పెద్దవత్సవలస, పూసర్లపాడు, జోగిపంతులుపేట, చిన్న వత్సవలస, ఆమదాలపాడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

# చీకట్లో ఆసుపత్రి

* కరెంటు పోతే ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో అంధకారం * పనిచేయని జనరేటర్ * చీకట్లో ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది




**ఇచ్ఛాపురం, అక్టోబర్ 3 (వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి చీకట్లో మగ్గుతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే అంధకారంగా మారుతోంది. జనరేటర్ పనిచేయకపోవడంతో విద్యుత్ సరఫరా లేని సమయంలో రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు నానావస్థలు పడుతున్నారు. క్యాండిల్స్ వెలుగులో రోగులకు సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. గురువారం రాత్రి సుమారు అరగంట సేపు ఇచ్ఛాపురంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆసుపత్రి మొత్తం అంధకారంగా మారిపోయింది. అత్యవసర రోగులు ఇబ్బందులు పడ్డారు. జనరేటర్ పనిచేయకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఆయన ఆసుపత్రిని సందర్శించగా, రోగులు తాము పడుతున్న అవస్థలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జనరేటర్ పనిచేయక, ఫ్యాన్లు పనిచేయకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు వాపోయారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



### ఎస్పీని కలిసిన
## ఉప రవాణా కమిషనర్

**శ్రీకాకుళం క్రైం, అక్టోబర్ 3(వార్త):** ఉప రవాణా కమిష నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.విజయసారధి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం రవాణా శాఖకు సంబంధించి పలు అంశాలపై ఎస్పీతో కలిపి ఉప రవాణా శాఖ కమిషనర్ చర్చించారు.



# అంబరాన.. కొత్తమ్మ తల్లి సంబరం

* ఆలయానికి పోటెత్తిన భక్తజనం * ముర్రాటలు సమర్పించిన భక్తులు * పెద్ద ఎత్తున అన్నసమారాధన









**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, అక్టోబర్ 3 (వార్త):** కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు జరిగిన ఈ ఉత్సావాలు చివరి రోజు అత్యంత వైభవంగా ముగిశాయి. వేకువజాము నుండే భక్తులు వేలాది సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. కొత్తపేట జంక్షన్ నుండి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్లు దారి పొడవున అడుగు వేయడానికి వీలు లేని విధంగా భక్తుల రద్దీ ఉండడంతో పాదచారులు, వాహనదారులు నానాఅవస్థలు పడ్డారు. ట్రాఫిక్ జాం కాకుండా పోలీసులు నానాతిప్పలు పడ్డారు. పగటి పూట గ్రామంలో పగటి వేషాలు, కొయ్యి డ్యాన్సులు భక్తులను అలరించాయి. స్థానిక రెడ్డిక వీధిలో గల కమ్మకట్టు చిన్నఅప్పలస్వామి ఇంటి నుండి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య తీసుకురాగా మహిళలు పసుపు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి దండకం చదివి తల్లిని చల్లదనం చేశారు. మెయిన్‌రోడ్డులో పోస్టు ఆఫీస్ అవరణలో రైసు మిల్లర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రజాపిత బ్రహ్మకూమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు చెందిన ఓంశాంతి వారు ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆలోచింపజేశాయి. రెండు కిలోమీటర్లు పొడవున పుట్‌పాత్ దుకాణాలు వెలిశాయి. ఈ సారి ఉత్సవాలకు ఎగ్జిబిషన్‌లో గల జైంట్‌వీల్, శాంతారా, టోరాటోరా, సలంబో, బ్రేక్ డ్యాన్స్‌తో పాటు స్విమ్మింగ్, రైలు, బెలూన్ వంటివి చిన్న పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో భక్తులు మూడు రోజులు కూడా చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో విచ్చేసారు. జాతర సందర్బంగా పోలీసులు అందించిన సేవల పట్ల భక్తులు పోలీస్ శాఖకు మంచి కితాబు ఇచ్చారు. టెక్కలి సిఐ కె.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఎస్ఐ సత్యన్నారాయణ పర్యవేక్షణలో సుమారు 450 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. గ్రామమంతా సిసి కెమెరాలు, డ్రోన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు అధికారులు పర్యవేక్షించారు.



### 40వేల మందికి అన్నదానం

కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా చివరరోజు గురువారం భక్తులకోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. మంత్రి అచ్చెన్నాయుడు సుమారు 40వేలు మందికి గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే దేవి నవరాత్రులు సందర్భంగా మండల కళింగకోమటి సభ్యులు మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గ మాతను ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, రాష్ట్ర కళింగ కోమటి అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413